# 12

## శ్రీనాధరావుతో పరిచయం

అతని తల్లిదండ్రులు పెట్టిన పేరేదో చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. దానిక్కారణం అతనికి కొంచెం సాహిత్యజ్ఞానం కలిగినప్పటినుండి తన పేరు 'శ్రీనాథరావు' అని పెట్టుకోవటమే. కవి రచయిత, విమర్శకుడు ఒక టేమిటి సాహిత్యకారులకు వుండాల్సిన లక్షణాలన్నీ తనలోనే మూర్తీభ వించియున్నాయని అతని నమ్మకం. ఆనాటి శ్రీనాథునిలోవున్న ప్రతిభ, వాక్చాతుర్యం మొదలైన గుణాలన్నీ తనలో కన్పించేవి కాబోలు రావుగారికి. బహుశా అందువల్లనే తన పేరు శ్రీనాథరావు అవి పెట్టుకుని ఉంటాడు.

రావుగార్ని ఇంట్లో అంతా తలా ఒక పేరుతో ముద్దుగా పిలుస్తారు. ఇంటికి పెద్దకొడుకు కాబట్టి తల్లి తన తండ్రిపేరు పెట్టాలని పట్టు పట్టింది. ఆమె తండ్రి ఆమె కడుపున ఇంత కాయకాస్తే తన పేరు పెట్టుకోవాలని ఎంతో ముచ్చట పడేవాడట. ఆయనగారి పేరు సీతారామయ్యగారు కాని అతని నాయనమ్మ తన భర్త పేరు పెట్టమని రెండు రోజులు అలిగి అన్నం తినకుండా పడుకున్నది. ఆమె భర్తగారి పేరు ఆంజనేయశర్మ. ఈ గొడవ ఇలా ఉండగానే పిల్లవాడికి బాలారిష్టం వచ్చింది. అతని తండ్రికి కలలో కాకాని సాంబశివుడు తన పేరు పెట్టుకోమని ఆదేశించాడు. చివరకు క్రిందా మీదా పడి, ఎంతో ఆలోచించి "సీతారామాంజనేయ సాంబశివరావు" అని నామకరణం చేశారు. ఆ పేరు మహాత్యమో లేక, ఆ సాంబశివుని మహాత్యమో కాని పిల్లవాడు గండం గడిచి బయటపడ్డాడు.

తల్లి "సీతారాం" అనీ, "సాంబూ" అని నాయనమ్మకు పిల్చుకో వాలని కోరిక ఉన్నా భర్త పేరు ఉచ్చరించ కూడదు. కాబట్టి "శివా" అని ముద్దుగా పిల్చేవారు. ఏది ఎలా ఉన్నా అతన్ని చూస్తూనే ఏ సాధారణ సుబ్బారావో, నారాయణరావో అని మాత్రం అనిపించదు.

అయిదు అడుగుల ఎత్తు, నల్లని సన్నని శరీరం, జులపాల వెంట్రుకలు కొంచెంగా ఎత్తివేసే కుడి కాలూ, లూజుగా జారిపోతూ ఉండే మధ్య

మధ్య పైకి లాగుతూ ఉండే కాకీ పాంటులోకి వేసిన తెల్లని షర్టూ, నీలపు గళ్ళ నెక్‌టై, యిదీ అతని రూపం. పెద్ద పెద్ద కవులకూ, రచయితలకూ గడ్డాలు ఉంటాయి. కనుక మన రావుగారు కూడా గడ్డం పెంచటం మర్చిపోలా. గడ్డాల్లో—పిల్లి గడ్డం, మేక గడ్డం మొదలైనవి ఎన్నో రకాలు ఉంటాయి. మన రావుగారి గడ్డం మాత్రం వీటిలో ఏ జాతికీ చెందదు. పిచ్చుక గూడు లాంటి ఆ గడ్డం ఏదో కొత్త అందాన్ని ఇస్తూ ఉంటుంది అతని ముఖారవిందానికి.

మీరు సాధారణంగా మాంటళింలోని పాండీబజారులో తిరిగే అలవాటు ఉంటే శ్రీనాథరావును చూసే ఉంటారు. ఎప్పుడైనా పొరపాటున మీరు అతన్ని కలుసుకోవటమంటూ తటస్థిస్తే, "ఎటెన్‌షన్"లో నుంచుని ముక్కుకు అరంగుళం దూరంలో రెండు చేతి వేళ్ళను సమంగా జోడించి, ముసి ముసి నవ్వులను వలకపోస్తూ, ఆనందాశ్రువులు రాలుస్తున్న ఓ వినోద మూర్తి మీ కళ్ళముందు ప్రత్యక్షమవుతుంది. అది ప్రొద్దున తొమ్మిది గంటల సమయమైతే అతని నమస్కారానికి జవాబు తరువాత ఇవ్వండి. ఆఫీసుకు పోవాలనో, కాలేజీకి టైమయిందనో, లేక ఇంట్లో ఎవరికో జబ్బుగా వుంది, అందువల్ల డాక్టరు కోసం పోతున్నాననో చెప్పండి. లేకపోతే సాయంత్రం నాలుగు గంటల వరకూ అతన్ని వదిలించుకోవటానికి తాతలు దిగిరావాలి.

ఆ నాలుగు గంటలకైనా ఎందుకు వదులుతాడో తెలుసా? మన రావుగారు ఆ సమయంలో మీరు ప్రాథేయపడ్డా దగ్గర ఉండరు. అందుకు కారణం ప్రతి రోజూ సాయంకాలం నాలుగు నుండి రాత్రి ఏడు గంటల వరకూ ఒక డ్యూటీకి హాజరవుతాడు. ఆ గంటల మధ్య మనవాడు ఏ ఆడపిల్ల ఒంటరిగా వెళుతున్నా కూడా వెళ్ళి ఇంటి వరకూ దిగబెట్టి మరీ వస్తాడు. వచ్చేప్పుడు ఇంటి నంబరు నోట్ చేసుకోవటంకూడా మర్చిపోడు. ఎంతో ప్రయత్నించి పేర్లుకూడా తెలుసుకుంటాడు. అంత తెలియని వాళ్ళకు తనే ఒక పేరు పెట్టేస్తాడు. డైరీలో రాసిన అన్ని పేర్లనూ, అడ్రసులనూ తను స్నేహితులనే వాళ్ళకు చూపించి తృప్తి పడతాడు. వాళ్ళంతా తనకు తెలిసినవాళ్ళనీ, అందులో ఎందరు తనను ప్రేమించి నిరాశ చెందినదీ, ఎంత మంది తనకు ఉత్తరాలు రాసిందీ ఏకరువు పెట్టి వినిపిస్తాడు.

కొత్తగా పరిచయమైన వాళ్ళకు ఇదంతా వినిపించడనుకోండి. కాని ఆంధ్ర సాహిత్య సంపూర్ణ చరిత్రను వినిపిస్తాడు. ఎంతో సందేహిస్తూ, చెప్ప

టానికి ఇష్టం లేకపోయినా చెప్పక తప్పనట్టు—తను ఆంధ్ర సాహిత్యానికి ంత సేవ చేసిందీ, ఎంత మంది నేటి ప్రసిద్ధ కవులను తను ప్రోత్సహించిందీ ఎంతమంది రచయితలను తను కలం పట్టుకోవటం నేర్పిందీ చెపుతాడు.

పోయిన వారం వచ్చి పోయిన మంత్రిగారిని గురించి చెప్పటం కూడా మర్చిపోడు. అయన తనను గవర్నమెంటు పేపరుకు ఏజంటుగా ఉండ మన్నాడనీ, ఇంకా వారిద్దరికీ ఎంత సన్నిహిత సంబంధ మున్నదో అంతా వినిపిస్తాడు.

మీకు చాలా అవసరమైన పని ఉన్నదని చెప్పిన తరువాత కూడా అతను మిమ్మల్ని వదిలి పెడతాడనే గ్యారంటీ ఇవ్వలేను. తను కూడా అంత వరకూ వచ్చి దిగబెడతాననో, లేక ఫలానా డాక్టరు తనకు స్నేహితుడనో చెప్పవచ్చును.

అతని పరిచయస్తులకు అతనంటే ఎంత భయమంటే, మా రామారావు అతన్ని చూడగానే ఆంజనేయ దండకం చదవ ప్రారంభిస్తాడు.

రావుగారికి ఎవరి పుస్తకాలయినా తీసుకుంటే మరల తిరిగి యివ్వటం జ్ఞాపకముండదు. వాళ్ళ వాళ్ళ పేర్లున్న కాగితాలు చింపి, వాటికి బదులుగా —'పండితుడు శ్రీనాథరావుగార్కి స్నేహపూర్వకంగా' అని వ్రాసి క్రింద స్వహస్తంతోనే ఆ పుస్తకం వ్రాసిన రచయిత పేరు కూడా లిఖిస్తాడు. పాపం, సంకోచంవల్ల తను స్వయంగా మీకు చూపించడు కాని అతనికి తెలియకుండానే ఆ వేళ్ళు ఆ పేజీలను మాత్రమే తెరుస్తాయి. మీరు అది చూసి ఎంతో బలవంతం చేసిన మీదట...తప్పనిసరి అని తెలుసుకొంటేకాని అన్ని పుస్తకాలు తెచ్చి చూపించడు.

ఒక ఉదయం ఎనిమిది గంటలకల్లా చేతులో ఒక ప్రసిద్ధ ఆంధ్ర "వార పత్రిక"ను పట్టుకుని ప్రత్యక్షమయ్యాడు. మనస్సులో ఆ రోజు లేస్తూనే ఎవరి ముఖం చూశానా అని ఆలోచించుకుంటూనే పరధ్యాన్నంగా కూర్చోమని చెప్పి స్నానం చేయటానికి వెళ్ళాను. అంతా ముగించుకుని తొమ్మిది గంటలకు వచ్చి చూద్దునుగదా రావుగారు ఎంతో శ్రద్ధగా పేపరు చదువుతున్నారు. ఇలా చూద్దును రచయిత తనే ఆ కథకు. సరి, అతను వచ్చిన పని అర్థమయింది. అందువల్ల చేతిలోని పేపరు తీసుకుని చదవటం ప్రారంభించాను.

"ఈ రోజుల్లోని కథలు ఉన్నాయి చూశారూ? అన్నీ కాపీ లేదంటే ఏ హిందీకో, ఇంగ్లీషుకో కాపీ కొట్టేసి సొంత పేరుతో అచ్చు వేయించుకొని అచ్చులో తమ పేరు చూసుకుని మురిసిపోయేది. ఇలాగ భావచౌర్యం జరిగినంతకాలం మన ఆంధ్ర సాహిత్యం బాగుపడదు" ఇలాగే ఏదో చెప్పుకు పోతున్నాడు.

ఇంతలో రామారావు వచ్చి నా చేతిలోని పత్రిక తీసుకున్నాడు. ఒక పది లైనులు చదివాడో లేదో అనేశాడు—"ఏమండీ, అభినవ శ్రీనాథరావు గారూ? కాపీ కొట్టినా, కొంచెం తెలివిగా కొట్టవద్దూ? మక్కీకి మక్కీయా కొట్టేది? అదీ ఒక ప్రసిద్ధ రచయితదా? హిందీ "మాధురి"లో నుండేనా సంగ్రహించారు?" అని రామారావు నిలదీసి అడుగుతుంటే నేను తెల్లబోయి చూశాను రావుగారి ముఖంలోకి. పాపం, ఆయన ఏడవలేక నవ్వుతూ, "బాబు రాగా లేచి కొంచెం పని ఉంది వస్తాను" అంటూ పేపరు కూడా తీసుకోకుండా వెళ్ళిపోయాడు. రామారావు పెద్దగా నవ్వుతున్నాడు. కాని నాకు మాత్రం నవ్వు రాలేదు. అతనిమీద జాలి కలిగింది!

అంతే ఆ రోజునుండి ఈరోజువరకూ మా ఇంటికి రాలేదు శ్రీనాథరావు. ఈ సంవత్సరంరోజుల్లో ఎక్కడా ఏ పేపర్లోనూ అతని పేరు చూసినట్లు కూడా గుర్తులేదు. వదిలాడు అంతే చాలురా బాబూ, అనుకునే నేనుకూడా అతన్ని కలుసుకోవటానికి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు.

ఒకరోజు సాయంకాలం స్నేహితుడింటికి బయలుదేరాను. పాండీ బజారు బస్ స్టాండింగ్‌లో నిల్చుని ఉన్నాడు శ్రీనాథరావు. ప్రక్కన ఎవరో యిద్దరు అమ్మాయిలు బస్‌కోసం నిల్చుని ఉన్నారు. వారు ఏదో విషయాన్ని గురించి సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. బహుశా వాళ్ళ కాలేజీలోని మొగపిల్లలు వాళ్ళను ఎలా ఏడిపిస్తారో చెప్పుకుంటున్నారు లాగున్నది. ఇక్కడ రావు గారు వాళ్ళ దృష్టిని తనవైపు తిప్పుకోవటానికి నానా పాట్లు పడుతున్నాడు. ఎడం చేత్తో నెక్ టైని లాక్కుంటూ, చిన్నగా దగ్గి ఒక చిరునవ్వును వాళ్ల పైకి విసిరాడు. వాళ్ళు ఏదో అంటూ ముఖం చిట్లించుకుని దూరంగా పోయి నిల్చున్నారు.

ఎలాగయినా అతని దృష్టిలో పడకుండా తప్పించుకు వెళ్ళ ప్రయత్నించాను. కాని ఎదురుగా వచ్చి చేసిన అతని నమస్కారానికి ప్రతి నమస్కారం చేయక తప్పింది కాదు.

"ఏదో చాలా అర్జెంటుగా వెళుతున్నారులా గున్నది ?"

"అవును మా స్నేహితుడికి జబ్బు చేసిందట, చూట్టానికి వెళుతున్నా"

"చాలా రోజులకు కన్పించారు కాఫీ పుచ్చుకు వెళ్లవచ్చును రండి" అంటూనే హోల్లోకి పోతున్న అతన్ని వెంబడించాను, ఆముదం త్రాగిన ముఖం పెట్టి.

నేను వద్దంటూనే ఉన్నాను. అతను రెండు స్వీట్లుకూ, రెండు హాట్లుకూ ఆర్డరిచ్చి చెప్పటం ప్రారంభించాడు.

"మీ యింటికి రావాలనుకుంటూనే ఉన్నా. కాని ఈ మధ్య కొంచెం విశాఖపట్నం వెళ్ళాల్సిన పని కలిగింది. అందువల్లనే రాలేకపోయాను."

వెంటనే నేను ఏమి పనిమీద వెళ్ళారని అడగాలని అతని ఉద్దేశం. ఎందుకు ? హాస్పటలకేనా ? అందామనిపించింది. కాని అనలేదు.

లాభం లేదనుకుని తనే ప్రారంభించాడు. "అక్కడ ఒక పిల్లను చూట్టానికి రమ్మని చాలా తొందర పెట్టారు."

"అలాగా" అన్నాను. నీకు పిల్లనిచ్చే దౌర్భాగ్యుడుకూడా ఉన్నాడా యీ ప్రపంచంలో అనుకుంటూ ?

రావుగారి వాక్ప్రవాహం ఆగిపోవటంతో నేనూ నా ఆలోచనల నుండి బయటపడ్డాను. ఎదురుగా శ్రీనాథరావు లేడు. తిరిగి చూద్దునుగదా చేతిలో బిలుతోసహా సర్వర్ ప్రత్యక్షం. తాగే తాగే కాఫీవదిలి, చెయ్యి కడుక్కొనే మిషతో ఎందుకు లేచి వెళ్ళాడో అర్థం చేసుకున్నాను.

బిల్లు నేను తీసుకున్నట్లు పూర్తినమ్మకం కలిగిన తర్వాతకాని వచ్చి కూర్చోలేదు మహాశయుడు. కాఫీత్రాగి లేచి వచ్చేటప్పుడు తెలియనట్లు, "బిల్లు ఎక్కడ ? అరె, మీరు తీసుకున్నారా ? ఇలా యివ్వండి" అన్నాడు, కొంచెం ముందుకు చెయ్యి చాపుతూ.

చేతులో పెడదామా అన్నంత కోపం వచ్చింది. కాని నాకు సంస్కార హృదయం (బిల్లు చెల్లించటంలోనే సభ్యత ఉన్నదనుకొనే యీ రోజుల్లో) అందుకు అంగీకరించలా.

పలకకుండా స్నేహితుని యింటివైపు నడుస్తున్నాను. వెంట ఏదో మాట్లాడుతూ శ్రీనాథరావుకూడా నడుస్తున్నాడు. అతనుకూడ మా స్నేహితుని యింటివరకూ కూడా వదలడని ముందే తెలుసు కాబట్టి నేను త్వరగా నడుస్తున్నాను.

స్నేహితుని ఇంట్లో కూర్చొని మాట్లాడుతున్నాము. ఇంతలో శ్రీనాథ రావు గాబరాపడటం చూశాను. ముఖం వెలవెల పోతూంది. అతని పని కుడితిలోపడ్డ ఎలుకలాగ వుంది.

"నమస్కారమండీ హనుమంతరావుగారూ ?" అన్న మాటంతో వులిక్కిపడి వెనక్కి చూశాను. మా స్నేహితుని చెల్లెలు లీల ఇంకా ఎవరో ఒక ఫ్రెండ్ నిల్చొని నవ్వుతున్నారు.

"పిల్ల బాగానే వుంది. కాని ఎడ్యుకేషన్ ఏమీలేదు. శుద్ధ విలేజ్ బ్రూట్‌లాగున్నది. మనం నలుగుర్లో చలామణి అయేవాళ్ళం చూడండీ. కనీసం నా ఫ్రెండ్స్‌తో మాట్లాడటమైనా చేతకాకపోతే ఏమి లాభం ?"

ఇలాగే ఏదో చెప్పుకుపోతున్నాడు. నేనుమాత్రం ఆలోచిస్తున్నను - ఎలాంటి వెధవాకూడా పిల్లను చూట్టానికి వెళ్ళి ఆ సంబంధం కుదరకపోతే పిల్ల నచ్చలేదని చెపుతాడే కాని, పిల్లకుకానీ పిల్లతరఫు వాళ్లకుకానీ తను నచ్చలేదని ఛస్తే చెప్పడుగదా !"

శ్రీనాథరావు మాత్రం విసుగూ, విరామం లేకుండా మాట్లాడుతూ పోతున్నాడు. బహుశా వాళ్ళఅమ్మ చిన్నప్పుడు ఉగ్గుపాలతో వస పోసి వుంటుంది అనుకున్నాను.

ఆ అమ్మాయికి వీడు ఎలా తెలుసా అని ఆశ్చర్యపడ్డాను. మరల పొరపాటుపడి వుంటుందనుకొని "మీరు పొరపడుతున్నారు. వీరి పేరు హనుమంతరావు కాదు, శ్రీనాథరావు. నా స్నేహితుడు" అన్నాను.

యిద్దరూ కిలకిలా నవ్వారు. "మేము యీయన్ను హనుమంతరావు అనే అంటాము లెండి" అన్నది కొంటెగా అతనివైపు చూస్తూ.

"వీరు నీకు తెలుసా ?" అని అడిగాడు, నా స్నేహితుడు చెల్లెల్ని. "అవును వీరు రోజూ సాయంకాలం నాలుగు గంటలకల్లా అరడబ్బా పౌడరు కొట్టి మా కాలేజీ గేటుముందు హాజరవుతారు. ఏమండీ, కొద్ది రోజులనుండి

కన్పించటం లేదు? యిప్పుడు ఏ కాలేజీ గేటు..." అంటూ వుండగానే వాళ్ళ అన్న ఆ అమ్మాయిని ఉరిమిచూశాడు. వెంటనే ఒక చిరునవ్వుమాత్రం అతనిమీద విసిరి, యిద్దరూ నవ్వుకుంటూ గదినుండి వెళ్ళిపోయారు.

మా స్నేహితుని క్షమాపణను కూడా విన్పించుకోకుండా ముఖంమీద కారుతున్న చెమటను తుడుచుకుంటూ "మర్చిపోయాను, చాలా తొందరపని వుంది" అంటూ జైలునుండి బైటపడే ఖైదీలాగ ఒక్క వూపులో బైటకు దూకేడు.

అంతే, ఆ రోజుకూ యీ రోజుకూ మరల నేను శ్రీనాధరావును చూడలేదు. యిదీ మా శ్రీనాధరావుగారి పరిచయము.

(ఆంధ్రప్రభ వారపత్రిక - 53